క్లుప్తంగా

పాముకాటుకు ఎద్దు మృతి

కుంటాల: మండల కేంద్రంలో ఎల్లమ్మల శంకర్ అనే రైతు ఎద్దు సోమవారం సాయంత్రం పాముకాటుతో మృతి చెందింది. మండలంలోని ఓలా శివారులో ఎడ్లను మేపుతుండగా పాము కాటు వేసిందని బాధితుడు పేర్కొన్నాడు. పశువైద్యాధికారి ప్రకాశ్ ఎద్దు కళేబరం పరిశీలించారు.

పొదుపు చేస్తేనే అభివృద్ధి



సమావేశమైన మహిళలు

కుంటాల: పొదుపు చేస్తేనే ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీ పేర్కొన్నారు. మంగళవారం అందాకూర్‌లో నిర్వహించిన గ్రామ సమైక్య సమావేశంలో మాట్లాడారు. బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించాలని ఆమె కోరారు. సమావేశంలో ఏపీఎం అశోక్, సీసీలు పెంటన్న, యూసుఫ్, కవిత, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఖానాపూర్: చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ఖానాపూర్ డివిజన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. సంఘం మండలాధ్యక్షుడు బండపాటి మనోహరస్వామి, ప్రధాన కార్యదర్శి మంత్రరాజ్యం దేవేందర్, కోశాధికారి చింతామణి శ్రీనివాస కృష్ణస్వామి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఎన్ఆర్ఐ వింజామర గీతాస్రవంతి విజయ్ సహకారంతో క్యాలెండర్ ముద్రించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, పుష్ప, శ్రీధర్, సురేశ్, నర్సింహస్వామి, నారాయణస్వామి, మారుతి, ఫణీంద్ర పాల్గొన్నారు.

స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటుకు వినతి

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని గొల్లపేట, ఇంద్రనగర్ వీధుల్లో ఉన్న రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుతోపాటు భారీ వాహనాలు రాకుండా చూడాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గొల్లపేట వాసులు మురళి, కాలనీవాసులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత



గుంతలు పూడ్చియివేస్తున్న గంగాధర్

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ నుంచి వట్టోలి వెళ్లే మార్గంలో రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతులు చేపట్టాలని అధికారులు, నాయకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. వాహనదారుల ఇబ్బందులను గమనించి గొడిసెరాకు చెందిన కారగిరి గంగాధర్ రూ.20 వేలు వెచ్చించి ఆరు కిలోమీటర్ల మేర గుంతల్లో మొరం నింపి మంగళవారం ట్రాక్టర్ సాయంతో పూడ్చివేశారు. దీంతో గంగాధర్‌ను పలువురు శాలువాతో సన్మానించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలోని పలువురు నాయకులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. భైంసాలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావ్ పటేల్ వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఆనంద్‌రావ్, విలాస్, ఈర్వా తదితరులు ఉన్నారు.

నేత్రపర్వంగా పడిపూజ

ఖానాపూర్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో సోమవారం రాత్రి అయ్యప్ప మహాపడిపూజ మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. శబరిమలై తరహాలో ఆలయం ఎదుట మకరజ్యోతి వెలిగించి భక్తుల సౌకర్యార్థం టీవీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. అంతకముందు స్వామివారికి వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు.

సత్కారం

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామంలో బండారి రాజేశం ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. పండుగకు గ్రామానికి వచ్చిన రాజేశంను మంగళవారం గ్రామస్తులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. స్థానికులు వెంకటేశ్, శేఖర్, కృష్ణయ్య, భీమన్న తదితరులు ఉన్నారు.

అట్టహాసంగా సంబురాలు

జిల్లా ప్రజలు ఆనందోత్సహాల నడుమ పండుగలను ఘనంగా నిర్వహించారు. సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగలను కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి జరుపుకొన్నారు. ఇళ్ల ముందు తీరొక్క రంగులతో ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు ఉంచి పూజలు చేశారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. కనుమ రోజున పశువులకు పూజలు చేశారు. ఆలయాలు సైతం భక్తులతో కిటకిటలాడాయి. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లినవారు పండుగలకు సొంతిళ్లకు రావడంతో గ్రామాలు సందడిగా మారాయి. - సాక్షి నెట్‌వర్క్



లోకేశ్వరంలో నోముల వేడుకలో మహిళలు

కుభీర్‌లోని విఠలేశ్వర మందిరంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ వేడుకలు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ ఉప్పు అరుణ్ మాట్లాడుతూ సంక్రాంతితో వాతావరణంలో చలి తీవ్రత తగ్గి వేడి పెరుగుతుందని.. సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశిస్తాడని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈనెల 22న రాముడికి పూజ చేస్తూ ఇంట్లో ఐదు దీపాలు వెలిగించాలని పిలుపునిచ్చారు.ఆర్ఎస్ఎస్ నాయకులు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

భైంసా మండలంలోని ఇలేగాం, దేగాం, వాలేగాం, కామోల్, లింగా, వాటోలి, మహాగాం, సిద్దూర్, వానల్‌పాడ్, కుంసర, మాటేగాం, తిమ్మాపూర్ గ్రామాల్లో పండుగ వేడుకలు నిర్వహించారు.

కుంటాల ప్రాచీన శ్రీకృష్ణ ఆలయంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎల్లమ్మల శంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గులు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. ఆలయ నిర్వాహకులు కే.కృష్ణారావు, తాటి శివ, నారాయణ, అర్చకుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

లోకేశ్వరం మండలంలోని గ్రామాల్లో మహిళలు సంక్రాంతి రోజున నోముల వేడుక నిర్వహించారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. తానూరు మండలంలో పశువులకు పూజలు చేశారు.



లక్ష్మణచాంద: వడ్యాల్‌లో ముగ్గు వేస్తూ..



కుంటాలలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు

క్రీడలతో స్నేహభావం, ఆరోగ్యం

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్



భైంసారూరల్: తిమ్మాపూర్‌లో బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

భైంసారూరల్: క్రీడలతో స్నేహభావం, ఆరోగ్యం పెంపొందుతుందని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో మొదటి బహుమతిగా లయన్స్ జట్టు, ద్వితీయ బహుమతిగా సన్‌రైజ్ జట్టు నిలిచాయి. గెలుపొందిన జట్లకు మంగళవారం ఎమ్మెల్యే బహుమతులను అందించారు. ఎంపీపీ అబ్దుల్ రజాక్, నిర్వాహకులు రాజు, గోపి, మహేశ్, నిఖిల్, మహేందర్ తదితరులున్నారు.

బాసరలో సప్తాహం ప్రారంభం

భైంసా: బాసరలోని శ్రీకృష్ణ ఆలయంలో హరినామ సప్తాహం కార్యక్రమాన్ని ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ సోమవారం ప్రారంభించారు. వారంపాటు జరిగే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని సూచించారు. అనంతరం భజన మండలి సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు.

భైంసాటౌన్: వెనుకబడి ఉన్న ముధోల్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు ఎమ్మెల్యే రామారావ్ పటేల్‌ను కోరారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ సమస్యలు వివరించారు. అంతకుముందు స్థానిక డాక్టర్ అసోసియేషన్ భవనంలో ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు సమస్యలకు పరిష్కారాలు సూచిస్తూ తీర్మానాలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ టికెట్ ముధోల్ నియోజకవర్గ అభ్యర్థికే కేటాయించాలని కోరారు. వీలు కాకుంటే టికెట్ పొందినవారు నియోజకవర్గ అభివృద్ధికి ముందుగా హామీ పత్రం ఇవ్వాలని తీర్మానించారు. ఫోరం జిల్లా అధ్యక్షులు డా ముష్కం రామకృష్ణాగౌడ్, చాకేటి లస్మన్న, పుండ్లిక్‌రావు, రమేశ్, పండిత్‌రావు, జనార్దన్‌రెడ్డి, భీంరావు డోంగ్రే తదితరులున్నారు.

అయ్యప్ప ఆలయంలో మహాపడి పూజ

భైంసాటౌన్: పట్టణంలోని అన్నపూర్ణ క్షేత్రంలో ఉన్న అయ్యప్ప ఆలయంలో సోమవారం సాయంత్రం మహాపడిపూజ– మకరజ్యోతి దర్శనం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే రామారావుపటేల్ హాజరై భక్తులతో కలిసి స్వామివారి ప్రతిమకు అభిషేకం, అర్చన, పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వచ్ఛ అభియాన్‌లో భాగంగా స్థానిక కిసాన్‌గల్లి మహాదేవ్ మందిరం పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో గురుస్వామి మంత్రి సాయినాథ్, బీజేపీ నాయకులు రాజేశ్‌బాబు, గంగాధర్, పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, గాలి రవి, అయ్యప్ప స్వాములు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

కుభీర్: వచ్చే నెల 15న సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించడంతోపాటు వేడుకలు అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంగళవారం ఎమ్మెల్యే రామారావుపటేల్‌కు గోర్‌సేన కార్యకర్తలు వినతిపత్రం అందించారు. గోర్‌సేన జిల్లా అధ్యక్షుడు అర్జున్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలి

- నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి
- వైఎస్సార్ కాలనీలో కార్డన్‌సెర్చ్



మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌రూరల్: వాహనదారులు తప్పనిసరిగా అన్ని ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కాలనీలో రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. బైక్ నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. గంజాయి సేవించినా, అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలనీలో 56 బైక్‌లు, 14 ఆటోలను తనిఖీ చేసి వదిలిపెట్టారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు వివరాలు చెప్పొద్దు



సోన్‌లో మాట్లాడుతున్న ఎస్సై రవీందర్

సోన్: అపరిచితులకు బ్యాంకు, వ్యక్తిగత వివరాలు చెప్పవద్దని ఎస్సై సంతోషం రవీందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యువకులు మత్తు పదార్థాలకు దూరం ఉండి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది దల్లుసింగ్, భీమేశ్, రామకృష్ణ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో సైబర్ నేరాలపై ఎస్సై శ్రీకాంత్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అపరిచితులు ఫోన్ చేసి ఓటీపీలు, ఇతర వివరాలు అడిగితే చెప్పవద్దని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై నారాయణరెడ్డి, సిబ్బంది గణేశ్, సురేశ్, సర్పంచ్ ఉల్వాజీ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

2కే రన్‌ను విజయవంతం చేయండి

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే 2కే రన్‌ను విజయవంతం చేయాలని తహసీల్దార్ శ్రీలత పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సిస్టమెటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) క్యాలెండర్‌లో భాగంగా 2 కే రన్‌ను నిర్వహిస్తున్నామని వివరించారు. ఓటర్లు, బీఎల్‌వోలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ గంగాధర్ తదితరులున్నారు.

అయోధ్య పాదయాత్రికులకు స్వాగతం



రాముని పాదుకలతో వస్తున్న అర్చకులు

నిర్మల్‌ఖిల్లా: పట్టణ శివారులోని బ్రహ్మంగారి మందిరం నుంచి బుధవార్‌పేట్, చింతకుంటవాడ, నగరేశ్వరవాడ తదితర కాలనీల్లో అయోధ్య పాదయాత్రికులకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. శ్రీరామమఠం వంశజులు చిలుకూరి శివాలయ ప్రధాన అర్చకులు శ్రీరామదాసి సురేశ్ ఆత్మరామ్ మహరాజ్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి శ్రీరాముల వారి పాదుకలతో పాదయాత్ర చేపట్టారు. వారికి నిర్మల్‌లో ఘన స్వాగతం లభించింది. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ నాయకులు అయ్యన్న గారి భూమయ్య, అంజికుమార్‌రెడ్డి, గంగిశెట్టి ప్రవీణ్, కిన్నెర రవి, కూన రమేశ్, రాఘవులు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆటల పోటీలు



లక్ష్మణచాంద: బహుమతి అందిస్తున్న రాజేశ్వర్



కిష్టాపూర్‌లో బహుమతి అందిస్తున్న దేవేందర్‌రెడ్డి

లక్ష్మణచాంద: యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకే ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు మండలంలోని చామన్‌పెల్లికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి ఎన్‌టీ రాజేశ్వర్ పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చామన్‌పెల్లిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించగా వివిధ గ్రామాల జట్లు పాల్గొన్నాయి. గెలుపొందిన జట్లకు సోమవారం రాత్రి రాజేశ్వర్ తన కుమారుడు, సినీ హీరో ఎన్‌టీ నియంత్‌తో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కడెం: టీఆర్ఎస్వీ నాయకులు కొప్పుల నరేశ్ ఆధ్వర్యంలో మండలంలోని సారంగపూర్‌లో ఈనెల14, 15 తేదీల్లో కబడ్డీ పోటీలు నిర్వహించారు. మండలంలోని గోసంపల్లె జట్టు విజేతగా, మస్కాపూర్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు సోమవారం నిర్వాహకులు కొప్పుల నరేశ్, సర్పంచ్ రాజిరెడ్డి బహుమతులు అందజేశారు.

లోకేశ్వరం: యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా ఆస్పత్రుల కోఆర్డినేటర్ దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కిష్టాపూర్, రాజూర, అబ్దుల్లాపూర్ గ్రామాల్లో ప్రారంభించిన క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. విజేతలకు బహుమతులు అందించారు.

కుంటాల: మండలంలోని అందాకూర్, లింబా(కే) గ్రామాల్లో నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగిశాయి. ఎస్సై హన్మాండ్లు హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచ్‌లు దాసరి కిషన్, ఆనందరావు పటేల్, ఎంపీటీసీలు మధుకర్, గిరీశ్‌కుమార్, నిర్వాహకులు బి.రవి, సత్యనారాయణ శ్రీనివాస్, ఏఎస్సై దేవరావు ఉన్నారు.

గ్రామాల్లో జాగృతి వారపత్రిక ఆవిష్కరణ



కుభీర్‌లో వారపత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

కుభీర్: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద ఆర్ఎస్ఎస్ నాయకులు అయోధ్య రాముడి చిత్రపటాలతో కూడిన జాగృతి వార పత్రిక ప్రతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం తపస్ క్యాలెండర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేశ్వర్, శిశు మందిర్ అధ్యక్షుడు ప్యాట లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయులు ఈర్ల హన్మాండ్లు, విఠలేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ పరుశురాం, ధర్మజాగరణ ప్రముఖ్ పీరాజీ, ఆర్ఎస్ఎస్ నాయకులు విజయ్, వాసు ఉన్నారు.

కుంటాల: మండల కేంద్రంలో జాగృతి వారపత్రికను హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు ఆవిష్కరించారు. జిల్లా ప్రచార ప్రముఖ్ కొత్తకాపు నారాయణ, సభ్యులు భుజంగం గణపతి, దొనికెన వెంకటేశ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ట్రాక్టర్ల వద్ద లోకేశ్వరం పోలీసులు

భైంసారూరల్: అనుమతుల్లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని పేండ్‌పెల్లి గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి.. కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సాథ్‌గాం సమీపంలో నాలుగు పట్టివేత..

లోకేశ్వరం: మండలంలోని సాథ్‌గాం గ్రామ సుద్దవాగు ప్రాంతంలో మంగళవారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై సాయికుమార్ మాట్లాడుతూ సాథ్గాం సమీపంలోని సుద్దవాగు నుంచి భైంసాకు అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. జరిమానా విధించాలని తహసీల్దార్ మోతీరాంకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాములోరి అక్షింతలు పంపిణీ



లక్ష్మణచాంద: హనుమాన్ ఆలయం వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో అయోధ్య రాములోరి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు మంగళవారం ఉదయం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం వీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తూ.. అక్షింతలు, రామాలయం ఫొటోలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మహిళలు మంగళహారతులతో వచ్చి అక్షింతలకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ హైమావతి, ఉపసర్పంచ్ పల్లవి, వీడీసీ సభ్యులు రాజు, అశోక్, శ్రీనివాస్, నాగుల రాజు, సాయి అఖిల్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: విశ్వహిందూ పరిషత్ భైంసా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రామారావుపటేల్, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు నారాయణ్‌రావుపటేల్, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, ఇతర ప్రముఖులను కలిసి అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు గుజ్జుల్‌వార్ వెంకటేశ్, నగరాధ్యక్షుడు మహిపాల్, కార్యదర్శి పెరుగు నవీన్, గుండాల రాజు, గంగాధర్, సుధాకర్ ఉన్నారు.

భైంసా: బాసర మండలం సాలాపూర్ గ్రామంలో మంగళవారం అయోధ్య రాముడి అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. కళశాలు నెత్తిన పెట్టుకొని ఇంటింటికీ వెళ్లి అక్షింతలు పంపిణీ చేశారు. అంతకుముందు హనుమాన్ ఆలయంలో అక్షింతలు ఉంచి పూజలు చేశారు.



భైంసాటౌన్: మాజీ ఎమ్మెల్యేతో వీహెచ్‌పీ నేతలు



బాసర: సాలాపూర్‌లో అక్షింతలతో భక్తులు

‘ఆదివాసీకే కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇవ్వాలి’

ఖానాపూర్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసీ అయిన ఉట్నూర్‌కు చెందిన ఆత్రం సుగుణకే కాంగ్రెస్ అధిష్టానం ఆదిలాబాద్ ఎంపీ టికెట్ ఇవ్వాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శులు పీటర్, సురేందర్, బహుజన కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి పస్పుల వెంకన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. 30 ఏళ్లుగా అన్ని వర్గాలతో సత్సంబంధాలు కలిగి ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ గిరిజనులను ఏకతాటిపైకి తెచ్చి వారి హక్కుల కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. సుగుణకు టికెట్ ఇస్తే తమ పార్టీలు, తాము పనిచేసే ప్రజా సంఘాల తరఫున మద్దతు ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే సైతం మద్దతిచ్చి అధిష్టానానికి నివేదిక ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు హైమద్ ఖాన్, తదితరులున్నారు.